TG/TEL/25/A3731

# నిజం
దృష్టి తెలుగు న్యూస్

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ | ఎడిటర్: వరుదు సుజాత | సంపుటి:-1 | సంచిక:-159 | పేజీలు:-4 | గురువారం 21-05-2026

SIMULTANEOUSLY PRINTED AT ADILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## మండుతున్న ఎండలు
# రేవంత్ కీలక సూచనలు

- తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండలు
- అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్న సీఎం
- వడదెబ్బకు గురైన వారికి తక్షణ వైద్యం అందించేలా వైద్య సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశం



తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండల తీవ్రత, వడగాడ్పులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ

2లో

## నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసు



- కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించినట్లు వెల్లడి
- కన్న కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఉందా అని ప్రశ్న
- కేసీఆర్ అవినీతి సామ్రాజ్యాన్ని కూల్చింది బీజేపీయే అన్న బండి సంజయ్

నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసని, పోక్సో కేసులో తన కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించానని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కన్న - మిగతా 2 లో

## తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు
పిడుగురాళ్లలో 47.6 డిగ్రీల ఉష్ణోగ్రత



- తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
- ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు
- రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని హెచ్చరిక

తెలుగు రాష్ట్రాల్లో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో - మిగతా 2 లో

## నేను ఇజ్రాయెల్‌లో అధ్యక్ష పదవికి పోటీ చేయవచ్చు

- తనకు ఇజ్రాయెల్‌లో 99 శాతం ప్రజాదరణ ఉందని వెల్లడి
- నెతన్యాహూ చాలా మంచివారని కితాబు
- ఇరాన్‌తో ఒప్పందానికి తొందరలేదన్న ట్రంప్



అమెరికాలో తన అధ్యక్ష పదవీకాలం ముగిసిన అనంతరం ఇజ్రాయెల్‌లో కూడా ప్రధాని పదవికి పోటీ చేయవచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సరదాగా అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, తనకు ఇజ్రాయెల్‌లో 99 శాతం - మిగతా 2 లో

## ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న మోదీ 'మెలోడీ' గిఫ్ట్!

- ఇటలీ పర్యటనలో మోదీ
- ఆ దేశ ప్రధాని మెలోనికి 'మెలోడీ' చాక్లెట్ల గిఫ్ట్
- వీడియోను సోషల్ మీడియాలో పెట్టిన మెలోని
- చాలా మంచి టోఫీలంటూ వ్యాఖ్య
- ఇద్దరి పేర్లను కలిపి 'మెలోడీ' అంటున్న నెటిజన్లు



భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిల మధ్య ఉన్న ఫ్రెండ్‌షిప్‌ను నెటిజన్లు సరదాగా 'మెలోడీ' అని పిలుస్తుంటారు. దీనిపై సోషల్ మీడియాలో ఎన్నో మీమ్స్ కూడా వచ్చాయి. అయితే ఈ క్రేజ్‌ను మోదీ భలే వాడుకున్నారు. తన ఇటలీ పర్యటనలో భాగంగా మెలోనికి - మిగతా 2 లో

## మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్‌పై రాహుల్ గాంధీ విమర్శలు



- రాహుల్ గాంధీ వాడిన భాష పాకిస్థాన్, ఆ దేశానికి మద్దతిచ్చే ఉగ్రవాదుల భాషను పోలి ఉంది
- ఆయన వ్యాఖ్యలు ఉగ్రభాషను పోలి ఉందన్న బీజేపీ
- ఆయన వ్యాఖ్యల వెనుక పాక్ హస్తం ఉందని ఆరోపణ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ సంస్థ 'దేశద్రోహులు' అని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు - మిగతా 2 లో

# సీఎం విజయ్ సంచలన నిర్ణయం

- అవినీతి అధికారులను పట్టిస్తే లక్ష మీదే!
- లంచం అడిగిన అధికారుల వివరాలు ఇస్తే లక్ష రూపాయల రివార్డ్
- తమిళనాడులో అవినీతిపై సీఎం విజయ్ సంచలన ప్రకటన
- ఫిర్యాదుకు వీడియో ఆధారం తప్పనిసరి అని స్పష్టం చేసిన ప్రభుత్వం
- అవినీతి నిరోధక శాఖకు పూర్తి అధికారాలు ఇస్తూ కీలక నిర్ణయం

2లో



తమిళనాడులో అవినీతిని సమూలంగా నిర్మూలించే దిశగా నూతన ముఖ్యమంత్రి విజయ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం అడిగే అధికారుల వివరాలను వీడియో ఆధారాలతో పట్టిస్తే, ఫిర్యాదు చేసిన వారికి ఏకంగా లక్ష రూపాయల రివార్డ్ అందిస్తామని ప్రకటించారు. ఈ పథకం రాష్ట్రంలో అవినీతిపై పోరాటంలో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ప్రభుత్వ అధికారి

## కేంద్రంలో బీజేపీ పతనం ఖాయం



- బెంగాల్‌లో మైనారిటీలు, వీధి వ్యాపారులే బీజేపీ లక్ష్యమంటూ ఆరోపణ
- తన ఇంటి కూల్చివేత నోటీసులపై స్పందించిన అభిషేక్ బెనర్జీ
- ఎలాంటి బెదిరింపులకు భయపడనని, బీజేపీపై పోరాటం ఆగదని స్పష్టీకరణ
- బీజేపీ 'బుల్డోజర్ సంస్కృతి'కి వ్యతిరేకంగా నిరసనలకు టీఎంసీ పిలుపు

బీజేపీపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా - మిగతా 2 లో

## ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించండి



- బాల్య వివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కర్నూలు, ఏఎస్ఆర్ జిల్లాలపై ప్రత్యేక దృష్టిపెడతాం
- డీఈవోలు, ఏపీసీలతో సమీక్షా సమావేశంలో మంత్రి లోకేశ్

ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా అధికారులు కృషిచేయాలి, ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సచివాలయంలో డీఈవోలు, ఏపీసీలతో మంత్రి సమీక్షించారు. కాకినాడ జిల్లాలో అప్పర్ - మిగతా 2 లో

## మత్స్యకార, అన్నదాతల సంక్షేమమే మాకు అత్యంత ముఖ్యం



- మత్స్యకారుల వలసలను నివారిస్తామన్న పవన్ కల్యాణ్
- స్థానికంగానే మెరుగైన ఉపాధి, ఆర్థిక అవకాశాలను కల్పిస్తామని వెల్లడి
- ప్రతి మత్స్యకార కుటుంబానికి వారి బ్యాంకు ఖాతాల్లోకి రూ. 20 వేలు జమ చేస్తున్నామన్న డిప్యూటీ సీఎం

ఆంధ్రప్రదేశ్ సుదీర్ఘ తీరప్రాంతంలో నివసిస్తున్న మత్స్యకార కుటుంబాల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ - మిగతా 2 లో

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు
# ఏపీలో పనిచేయాలి

- ఫౌండేషన్ 45 వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం
- హింసలేని సమాజం, ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని బోధిస్తున్నారన్న సీఎం
- గ్రామాల నుంచి కొలంబియా వరకు అనిశ్చితి నెలకొంటే చర్చల ద్వారా మార్పులు తెచ్చినట్లు వెల్లడి



2లో

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పని చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కోరారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శ్రీ రవిశంకర్ గురూజీ జన్మదినోత్సవంతో పాటు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ 45వ వార్షికోత్సవంలో పాల్గొనటం గౌరవంగా భావిస్తున్నానని అన్నారు. కేవలం ఓ

నిజం
దృష్టి తెలుగు న్యూస్
TG/TEL/25/A3731
గురువారం 21-05-2026

# మత్స్యకార, అన్నదాతల సంక్షేమమే మాకు అత్యంత ముఖ్యం

మొదటిపేజీ తరువాయి – స్పష్టం చేశారు. మత్స్యకారుల వలసలను నివారించడంతో పాటు, వారికి స్థానికంగానే మెరుగైన ఉపాధి, ఆర్థిక అవకాశాలను కల్పించడమే తమ ప్రభుత్వం ముందున్న ప్రధాన లక్ష్యమని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, సంక్షోభాల కంటే కూడా అన్నదాతలు, మత్స్యకారుల సంక్షేమమే తమకు అత్యంత ప్రాధాన్యమని, గతంలో ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటామని ఈ సందర్భంగా ఆయన మరోసారి హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే, మత్స్యకారుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటుతూ వరుసగా రెండో ఏడాది కూడా 'మత్స్యకార సేవలో' పథకానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం విజయవంతంగా విడుదల చేసింది. ఈ పథకం కింద అర్హత సాధించిన ప్రతి మత్స్యకార కుటుంబానికి రూ. 20,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని ఎక్కడా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, అత్యంత పారదర్శకంగా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. తీరప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం ద్వారా భవిష్యత్తులో వలసలను పూర్తిగా అరికట్టేలా మరిన్ని పటిష్ఠమైన చర్యలు తీసుకోబోతున్నట్లు వెల్లడించారు.

# మండుతున్న ఎండలు.. రేవంత్ కీలక సూచనలు

మొదటిపేజీ తరువాయి – ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్న వాతావరణ శాఖ (×వీణ) హెచ్చరికల నేపథ్యంలో సీఎం స్పందించారు. జిల్లాల్లో మారుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, జిల్లా కలెక్టర్లకు తగిన దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఎండల తీవ్రతను తట్టుకునేందుకు వీలుగా ప్రజల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ఆసుపత్రుల వరకు ఓఆర్ఎస్ (ా=ా) ప్యాకెట్లను భారీగా అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. వేసవి దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. వడదెబ్బకు గురైన బాధితులకు ఆసుపత్రుల్లో తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశిస్తూనే, పట్టణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయకుండా సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసు

మొదటిపేజీ తరువాయి – కొడుకును పోలీసులకు స్వయంగా అప్పగించిన సందర్భం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలనే తాను కుమారుడిని అప్పగించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీలో ప్రతి ఒక్కరూ సుశిక్షితులైన కార్యకర్తలే అన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే పార్టీ కార్యకర్తను 'మీ చివరి కోరిక ఏమిటి' అని అడిగితే చనిపోయిన తర్వాత బీజేపీ జెండా కప్పాలని కోరుకుంటామని అన్నారు. తనను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారని ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందిస్తూ, కేసీఆర్ పార్టీకి లోక్ సభలో ఒక్క ఎంపీ కూడా లేరని అన్నారు. వారు ఫామ్ హౌస్‌లో కూర్చుని ఏదైనా చెబుతారని అన్నారు. ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది, ఆ కుటుంబ పాలనను అంతం చేసింది తామేనని అన్నారు. అందుకే తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

# తెలుగు రాష్ట్రాలలో భానుడి భగభగలు

మొదటిపేజీ తరువాయి – అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లలో 47.6 డిగ్రీలు, తెలంగాణలోని నిర్మల్‌లో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. తెలంగాణలోని 19 జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా, ఏపీలోని 11 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణలోని హన్మకొండలో 46.4, జగిత్యాలలో 46.3, ఆదిలాబాద్‌లో 46.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో కృష్ణా జిల్లాలోని కంకిపాడు, మార్కాపురంలోని నందనమారెళ్ల, 46.1 డిగ్రీలు, తణుకులో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

# నేను ఇజ్రాయెల్‌లో అధ్యక్ష పదవికి పోటీ చేయవచ్చు

మొదటిపేజీ తరువాయి – ప్రజాదరణ ఉందని పేర్కొన్నారు. అందుకే అక్కడ కూడా ప్రధాని పదవికి పోటీ చేయవచ్చని చమత్కరించారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ చాలా మంచివారని కితాబిచ్చారు. ఏం కోరుకుంటే అది చేస్తారని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌లో నెతన్యాహూను సరిగ్గా ట్రీట్ చేయడం లేదని వాపోయారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఒప్పందం అంశంపై కూడా ఆయన స్పందించారు. యుద్ధంపై ఇరాన్‌తో ఒప్పందానికి వచ్చే విషయంలో ఎలాంటి తొందరపాటు లేదని స్పష్టం చేశారు. ఒప్పందం కుదరకుంటే త్వరలో ఇరాన్‌పై విరుచుకుపడతామని ట్రంప్ ఇటీవల హెచ్చరించిన విషయం తెలిసిందే.

# మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్‌పై రాహుల్ గాంధీ విమర్శలు

మొదటిపేజీ తరువాయి – చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రజలకు సూచించడం తీవ్ర దుమారం రేపింది. ఆర్థిక సంక్షోభం వల్ల దేశ ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రధాని మాత్రం ఇటలీలో చాక్లెట్లు పంచుకుంటూ బిజీగా ఉన్నారని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. పొదుపు కోసం పిలుపునిచ్చిన ప్రధానియే వాటిని పాటించడం లేదని విమర్శించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ స్పందించింది. రాహుల్ గాంధీ వాడిన భాష పాకిస్థాన్, ఆ దేశానికి మద్దతిచ్చే ఉగ్రవాదుల భాషను పోలి ఉందని బీజేపీ మండిపడింది. ఆయన వ్యాఖ్యల వెనుక పాక్ హస్తం ఉందని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. అక్కడి నేతలు చెప్పినట్లుగానే రాహుల్ గాంధీ మాట్లాడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రిని అవమానించడం అతడికి అలవాటుగా మారిందని అన్నారు. రాహుల్ గాంధీ భాష పాకిస్థాన్ నాయకుల భాషలా ఉందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ గురించి ప్రపంచానికి తెలుసని, రాహుల్ గాంధీ నుంచి ప్రశంసలు అవసరం లేదని విమర్శించారు. దేశంలో అశాంతిని రగల్చాలని రాహుల్ గాంధీ కోరుకుంటున్నారని అన్నారు. కానీ మోదీ, అమిత్ షాలకు ప్రజలు అండగా ఉన్నారని అన్నారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ మరిచిపోకూడదని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి అవమానమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ అన్నారు. ప్రధానిని అనడం ద్వారా రాహుల్ గాంధీ 140 కోట్ల మంది ప్రజలను దేశద్రోహులుగా పేర్కొన్నట్లే అన్నారు. ఆయన భాష పాకిస్థాన్, ఉగ్రవాదులను పోలి ఉందని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని కూల్చివేసే పనిని కాంగ్రెస్ చేపట్టిందని సీనియర్ బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ అన్నారు. వాస్తవానికి రాహుల్ గాంధీ ఈ రోజు ఏవైతే మాట్లాడుతున్నారో, నాడు ఎమర్జెన్సీ విధించిన ఇందిరాగాంధీకి వర్తిస్తుందని వ్యాఖ్యానించారు. అవమానకరమైన భాషను ఉపయోగించడం కాంగ్రెస్ ముఖ్య నాయకులకు అలవాటుగా మారిందని విమర్శించారు. ప్రధాని మోదీని దూషించడం, ఆరెస్సెస్‌ను దూషించడం వారికి పరిపాటిగా మారిందని అనురాగ్ ఠాకూర్ మండిపడ్డారు.

# సీఎం విజయ్ సంచలన నిర్ణయం



మొదటిపేజీ తరువాయి – కనీసం వెయ్యి రూపాయల లంచం డిమాండ్ చేసినా సరే, బాధితులు ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. బాధితులు చేయాల్సిందల్లా లంచం అడుగుతున్న అధికారి వీడియోను రహస్యంగా చిత్రీకరించి, దానిని ఆధారంగా చూపిస్తూ అవినీతి నిరోధక శాఖకు (ఏసీబీ) రిపోర్ట్ చేయడమే. ఫిర్యాదులో నిజానిజాలు నిర్ధారించుకున్న తర్వాత సమాచారం అందించిన వారికి లక్ష రూపాయల బహుమతిని అందజేస్తారు. అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్నప్పటికీ తమిళనాడులో ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై తరచూ ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సీఎం విజయ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. అవినీతిపై యుద్ధం ప్రకటించిన ఆయన, రాష్ట్ర ఏసీబీని పూర్తిగా ప్రక్షాళన చేసి, దానికి పూర్తి అధికారాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విజయ్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ పథకం గనుక పకడ్బందీగా అమలైతే, రాష్ట్ర పరిపాలనలో ఇది విప్లవాత్మక మార్పుకు నాంది పలుకుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అవినీతి రహిత పాలన కోసం ఎదురుచూస్తున్న ప్రజల నుంచి ఈ నిర్ణయానికి భారీ మద్దతు లభించే అవకాశం ఉంది.

# ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించండి

మొదటిపేజీ తరువాయి – ప్రైమరీ స్కూల్స్ లో స్టూడెంట్, టీచర్ యావరేజ్ అటెండెన్స్ తక్కువగా ఉంది. దీనిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. బేసిక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, పదో తరగతి పరీక్షా ఫలితాలు, మధ్యాహ్న భోజనం వినియోగంలో జిల్లా వెనుకబడి ఉందన్నారు. అపార్ ఐడీ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచారని మంత్రి ప్రశంసించారు. కాకినాడ డీఈవో పి.రమేష్ స్పందిస్తూ, జిల్లాలో 3,665 మంది డ్రాపౌట్స్ ఉన్నారని, ఎన్ రోల్ కానివారు 14,840 మంది ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు అసలు ఎన్‌రోల్ కానివారిపై దృష్టిసారించామని చెప్పారు. పలు మండలాల్లో సూడెంట్స్ అటెండెన్స్ తక్కువగా ఉండటంపై తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకువస్తున్నట్లు వివరించారు. పదో తరగతి పరీక్షల్లో ఈ ఏడాది 80.47శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. 500కు పైగా మార్కులు సాధించిన వారు 2,789 మంది ఉన్నారని తెలిపారు.

### ప్రతి విద్యార్థిని ట్రాక్ చేయాలి

ప్రకాశం జిల్లాలో విద్యార్థుల డ్రాపౌట్స్ పై మంత్రి లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. వలస వెళ్లే వారిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పాఠశాలకు సెలవుల అనంతరం విద్యార్థులు ఏ ప్రాంతానికి వెళ్లినా వారి చదువు కొనసాగేలా ట్రాక్ చేయాలని ఆదేశించారు. సీజనల్ హాస్టల్స్ ను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో స్టూడెంట్, టీచర్ అటెండెన్స్ తక్కువగా ఉందని, లీప్ యాప్ లో టీచర్ అటెండెన్స్ ను ఇంటిగ్రేట్ చేయాలని సూచించారు. స్టూడెంట్, టీచర్ రేషియోపైనా దృష్టిసారించాలన్నారు. ప్రకాశం జిల్లా డీఈవో సీవీ రేణుక స్పందిస్తూ.. ఈ ఏడాది జిల్లాలో పది శాతం ఎన్ రోల్ మెంట్ పెరిగిందని చెప్పారు. పాఠశాలలకు సెలవుల అనంతరం వ్యవసాయ పనుల్లో పడి విద్యార్థుల హాజరు నమోదు తక్కువగా ఉంటోందని వివరించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారని, పదో తరగతి టాపర్లను సన్మానించారని తెలిపారు. వచ్చే ఏడాది మరింత ఉత్తమ ఫలితాలు సాధిస్తామని చెప్పారు.

### బాల్యవివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చిత్తూరు జిల్లాలో బాల్య వివాహాల పట్ల మంత్రి నారా లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో జీఎఫ్ఎల్ఎన్ పై దృష్టి సారించాలని ఆదేశించారు. స్టూడెంట్స్ ఫెర్ఫార్మెన్స్ కూడా తక్కువగా ఉందని, ఓవరాల్ ఫెర్ఫార్మెన్స్ లో కూడా చిత్తూరు వెనుకబడి ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. చిత్తూరు డీఈవో కే.రాజేంద్రప్రసాద్ స్పందిస్తూ.. చిత్తూరుకు తమిళనాడు, బెంగళూరు దగ్గరగా ఉండటంతో డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. పలుచోట్ల బాల్యవివాహాలు కూడా జరుగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. లీప్ యాప్ డౌన్ లోడ్స్ పై దృష్టికేంద్రీకరిస్తామని చెప్పారు.

ఏఎస్ఆర్ జిల్లాకు అన్ని విధాల అండగా ఉంటాం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని, ఆ జిల్లాకు అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి లోకేశ్ చెప్పారు. హైస్కూల్స్ లో డ్రాపౌట్స్ ఎక్కువగా ఉండటంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై దృష్టిసారించాలని ఆదేశించారు. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో విద్యార్థుల చేరిక తక్కువగా ఉందని, దీనిపైనా దృష్టిపెట్టాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాలపై స్పందిస్తూ, అక్కడి విద్యార్థుల్లో కసి ఉందని, వారికి దిశానిర్దేశం చేస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. డీఈవో కే.రామకృష్ణారావు స్పందిస్తూ.. జిల్లాలో 3,242 మంది డ్రాపౌట్స్ ఉన్నారు. స్టూడెంట్స్ యావరేజ్ అటెండెన్స్ 79.30 శాతం ఉందని, టీచర్ల సరాసరి హాజరు 78.40 శాతంగా ఉందని వివరించారు.

### స్లిప్ టెస్ట్ అటెండెన్స్ పై దృష్టిపెట్టాలి

ఏలూరు జిల్లాలో స్లిప్ టెస్ట్ అటెండెన్స్ తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారించాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. టీచర్ అటెండెన్స్ పైనా దృష్టిసారించాలన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఎందుకు వెనుకబడి ఉన్నారని మంత్రి ఆరా తీశారు. కొన్ని మండలాల్లో ఉత్తీర్ణతా శాతంపై దృష్టిపెట్టాలని ఆదేశించారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ స్పందిస్తూ.. ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. టీ టైమ్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల పనితీరు గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నట్లు చెప్పారు.

### విద్యార్థుల హాజరుపై దృష్టి కేంద్రీకరించాలి

పల్నాడు జిల్లాలో విద్యార్థుల హాజరుపై దృష్టికేంద్రీకరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. టీచర్ అటెండెన్స్, లీప్ యాప్ డౌన్ లోడ్స్ పైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పల్నాడు జిల్లాలో స్కూల్ అకడమిక్ స్టార్ రేటింగ్ లో హైస్కూల్స్ ఎక్కువగా 3స్టార్ రేటింగ్ లో ఉండటం పట్ల మంత్రి అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల్లో నమ్మకం కలిగించేలా కృషిచేయాలన్నారు. పల్నాడు డీఈవో పీవీజే రామారావు స్పందిస్తూ.. మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో ఇన్ ఫ్రాస్ట్రక్చర్, విద్యార్థుల డ్రాపౌట్స్ పై దృష్టిసారించినట్లు చెప్పారు.

### కర్నూలు జిల్లాపై ప్రత్యేక దృష్టిసారిస్తాం

కర్నూలు జిల్లా ఫలితాల పట్ల మంత్రి లోకేశ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. యువగళం పాదయాత్ర సమయంలో కర్నూలు జిల్లాలో భయానక పరిస్థితులు చూశానని, కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం అవసరమైన అన్ని చర్యలు చేపడతామని చెప్పారు. ఇందుకు సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం, డ్రాపౌట్స్ పై ఎక్కువ దృష్టిపెట్టాలని అధికారులను ఆదేశించారు. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్, పదో తరగతి పరీక్షా ఫలితాలు, టీచర్, స్టూడెంట్స్ అటెండెన్స్ లో జిల్లా వెనుకబడి ఉందని చెప్పారు.

### మన్యం జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం బాగుంది

పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం బాగుందని, ఇందుకు గల కారణాలను మంత్రి లోకేశ్ ఆరా తీశారు. జిల్లాలో జీఎఫ్ఎల్ఎన్ ఇంప్రూవ్ మెంట్ కు ఇంకా అవకాశం ఉందని, దీనిపై దృష్టిసారించాలని ఆదేశించారు. పిల్లల ఆరోగ్యం పట్ల కూడా జాగ్రత్త వహించాలని సూచించారు. ముస్తాబు కార్యక్రమాన్ని ప్రశంసించారు. డీఈవో పి. బ్రహ్మజీ రావు స్పందిస్తూ.. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో ఉందని చెప్పారు. త్వరలో 6వేల మంది విద్యార్థులతో కోలాటం కార్యక్రమం నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు.

### అకడమిక్ ఎక్స్ లెన్స్ పై దృష్టిపెట్టండి

పశ్చిమ గోదావరి జిల్లాలో అకడమిక్ ఎక్స్ లెన్స్ పై దృష్టికేంద్రీకరించాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇన్ ఫ్రాస్ట్రక్చర్, స్టూడెంట్–టీచర్ రేషియో బాగుందని ప్రశంసించారు. డీఈవో నారాయణ స్పందిస్తూ.. ప్రైమరీ స్కూల్స్ లో టీచర్ అటెండెన్స్ తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారిస్తామని చెప్పారు. డోర్ టూ డోర్ ప్రచారంలో లీప్ యాప్ డౌన్ లోడ్స్ పై దృషిపెడతామని తెలిపారు. తిరుపతి జిల్లాకు చెందిన ఎస్జీటీ వాణి, అనంతపురం జిల్లా డీఈవో మోహన్ కృషిని మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

# ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి సంస్థలు ఏపీలో పనిచేయాలి



మొదటిపేజీ తరువాయి – ముఖ్యమంత్రిగానే ఇక్కడికి రాలేదని, ఓ భారతీయుడిగా, గురూజీ బోధనల్ని అనుసరిస్తున్న వ్యక్తిగా ఇక్కడికి వచ్చానని పేర్కొన్నారు. ఆయన కేవలం ఓ ఆధ్యాత్మికతను బోధించే ఓ గురువు మాత్రమే కాదని, శాంతిసామరస్యాలను చాటిచెప్పే ప్రపంచ మానవుడని కొనియాడారు. ప్రాచీన భారతీయ విజ్ఞానానికి ఆధునిక ప్రపంచానికి వారధిగా శ్రీరవిశంకర్ గురూజీ వ్యవహరిస్తున్నారుని అన్నారు. హింసలేని సమాజం–ఒత్తిడి లేని మనుషులు అనే అంశాన్ని సాధించాలని దశాబ్దాలుగా బోధిస్తూ మానవాళికి గొప్పసేవ చేస్తున్నారని కితాబిచ్చారు. యుద్ధాలతో శాంతికి దూరమైన సమాజాన్ని, అనిశ్చితి నుంచి బయటపడేసేలా మానవత్వం అనే అత్యుత్తమ మార్గాన్ని ఆయన ఎంచుకున్నారని కొనియాడారు. యుద్ధక్షేత్రాల నుంచి ట్రాన్స్ ఫర్మేటివ్ పవర్, డైలాగ్, ఇన్నర్ స్ట్రెంత్ అనే విధానాలను అనుసరించారని పేర్కొన్నారు. గ్రామాల నుంచి అంతర్జాతీయ స్థాయి సంస్థల వరకూ, అనిశ్చితి నెలకొన్న కొలంబియా ప్రాంతాల వరకూ చర్చలు అనే శాంతి మార్గం ద్వారా మార్పులు తెచ్చారని గుర్తు చేశారు. సామాన్య ప్రజలతో పాటు అంతర్జాతీయ సంస్థల విశ్వాసాన్ని గెలుచుకున్న ఆధ్యాత్మికవేత్త శ్రీ రవిశంకర్ గురూజీ అన్నారు. 45 ఏళ్లక్రితం హ్యాపీ హ్యూమన్ బీయింగ్, స్ట్రెస్ ఫ్రీ సొసైటీ బెటర్ వరల్డ్ అనే విజన్‌తో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోట్లాది మందికి ప్రేరణగా నిలిచిందని ముఖ్యమంత్రి అన్నారు. సురక్షిత తాగునీరు, రివర్ రిజునవేషన్, మహిళా స్వయం సమృద్ధి, విలువలతో కూడిన విద్య లాంటి రంగాల్లో ప్రజలకు సేవలందిస్తున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ ను ఆయన అభినందించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి టెక్నాలజీలు రోజువారీ జీవితంలో చాలా ప్రభావాన్ని చూపిస్తున్నాయని వెల్లడించారు. భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచ దేశాలను ప్రభావితం చేస్తున్నాయని, సామాన్య ప్రజల జీవితాలు కూడా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతోందని అన్నారు. గ్యాస్, ఇంధనం లాంటి వనరుల మార్కెట్ లభ్యత ప్రజలను ఒత్తిడికి గురి చేస్తోందని తెలిపారు. ఈ సమయంలో ఒత్తిడిని ఎదుర్కోని సమర్థంగా జీవించాల్సిన అవశ్యకత ఉందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలోనే ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు మానవాళికి అత్యుత్తమ సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ లాంటి సమర్థవంతమైన నేత దేశానికి నేతృత్వం వహిస్తున్నారని, ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రగామిగా మారుతుందని జోస్యం చెప్పారు. వేల ఏళ్ల క్రితం వరకూ మానవాళిని నడిపించిన నేల ఇది. ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించిన దేశం మనదని పేర్కొన్నారు. ఆధునిక జీవనంలో శాంతిని సాధించేలా శ్రీ రవిశంకర్ గురూజీ తన బోధనలతో ప్రభావితం చేశారని, సంస్కృతితో మిళితమైన ఆధునికత, విలువలతో కూడిన జీవనం లాంటి ఎన్నో అంశాల ద్వారా తన బోధనల్ని సాగిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో మేం కూడా ప్రజాప్రతినిధులు, అధికారులకు కూడా ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా తరగతులు నిర్వహించామని గుర్తు చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన నేల నుంచి తాను వచ్చానని, ప్రపంచంలో ఉండే హిందువులంతా ఒక్కసారైన తిరుపతి శ్రీవారిని దర్శించుకోవాలని అనుకుంటారని అన్నారు. శ్రీశైలం, ఆహోబిలం, అన్నవరం, సింహాచలం లాంటి అధ్యాత్మిక క్షేత్రాలు నిండిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను రాష్ట్రంలో నిర్మిస్తున్నామని, పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి, టెక్నాలజీ మాత్రమే కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మార్చటమేననేది తన భావన అన్నారు. ప్రతీ పౌరుడూ శాంతి సౌఖ్యాలు, ఆనందంగా జీవించాలన్నదే తన అభిప్రాయమని పేర్కొన్నారు. ఏపీ సమీకృత అభివృద్ధి సాధించాలన్నదే తన లక్ష్యం కూడా అన్నారు. ఏపీలోని ప్రతీ పౌరుడికీ అత్యుత్తమ జీవన ప్రమాణాలు కల్పించేలా సంకల్పం తీసుకున్నామని చంద్రబాబునాయుడు అన్నారు. అందుకే పీ4 లాంటి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అందుకే స్వర్ణాంధ్ర 2047 విజన్ కూడా అమలు చేశామని వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీని తయారు చేయటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సాంకేతికత సాయంతో ఏపీని గ్లోబల్ ఎకానమీలో ఓ కీలకమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. అదే సమయంలో ఎలాంటి ఒత్తిడిలేని సమాజాన్ని కూడా తీసుకురావాలని పేర్కొన్నారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ఇంత అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ ప్రజల్లో శాంతి సౌఖ్యాలు రావాలంటే ఆధ్యాత్మికత అవసరమని పేర్కొన్నారు. దీనికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ లాంటి సంస్థలు ఏపీలో పనిచేయాలని కోరారు.

### గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆశీస్సులు పొందిన ఎంపీ సానా సతీష్ బాబు

బెంగళూరులో నిర్వహించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ ఆశీస్సులను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పొందారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో కలిసి రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం గురుదేవ్‌కు పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ, గురుదేవ్ ఆశీస్సులు పొందడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆధ్యాత్మికత మనిషిలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజసేవలో మరింత బాధ్యతతో పనిచేయడానికి ప్రేరణనిస్తుందని పేర్కొన్నారు.

# ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న మోదీ 'మెలోడీ' గిఫ్ట్!

మొదటిపేజీ తరువాయి – సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చి అందరినీ నవ్వించారు.

### స్వీట్ గిఫ్ట్

ఐదు దేశాల పర్యటనలో భాగంగా రోమ్ చేరుకున్నారు మోదీ. ఈ సందర్భంగా మెలోనిని కలిసిన ఆయన.. భారత్‌లో ఎంతో పాప్యులర్ అయిన 'పార్లే మెలొడీ' చాక్లెట్ ప్యాకెట్‌ను బహుమతిగా ఇచ్చారు. ఇద్దరు నేతల పేర్లను కలిపి ఇంటర్నెట్‌లో నడుస్తున్న ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని మోదీ ఈ సరదా గిఫ్ట్ ప్లాన్ చేశారు.

### వీడియో వైరల్

ఈ చాక్లెట్ ప్యాకెట్‌ను అందుకున్న మెలోని.. ప్రధాని మోదీతో కలిసి దిగిన ఒక చిన్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకున్నారు. 'బహుమతికి చాలా థాంక్స్' అని ఆమె రాశారు. వీడియోలో మెలోని మాట్లాడుతూ.. 'ప్రధాని మోదీ నాకోసం చాలా మంచి టోఫీలు తెచ్చారు' అనగానే, పక్కనే ఉన్న మోదీ నవ్వుతూ 'మెలొడీ' అని అన్నారు. ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. గంట వ్యవధిలో లక్షకు పైగా లైక్స్, దాదాపు 9,000 కామెంట్స్, 25 వేలకు పైగా షేర్స్ వచ్చాయి.

### కార్ డిప్లొమసీ

రోమ్ చేరుకున్న మోదీకి మెలోనీ ఘన స్వాగతం పలికారు. ఇద్దరూ కలిసి కార్‌లో ప్రయాణిస్తూ నగర వీధుల్లో సందడి చేశారు. తర్వాత రాత్రి పూట రోమ్‌లోని ప్రసిద్ధ చరిత్రాత్మక కట్టడం కొలోసియంను సందర్శించారు. అక్కడ కాసేపు నడుస్తూ ఇరు దేశాల మధ్య మైత్రిని మరింత బలోపేతం చేయడంపై సుదీర్ఘంగా చర్చించుకున్నారు.

### బహుమతిగా కాశీ చిత్రం

ఈ పర్యటనలో మోదీని ఇటలీకి చెందిన ప్రముఖ చిత్రకారుడు జాంపాలో టొమాసెట్టి కలిశారు. ఆయన స్వయంగా గీసిన వారణాసి (కాశీ) పెయింటింగ్‌ను మోదీకి బహుమతిగా ఇచ్చారు. టొమాసెట్టికి భారతీయ సంస్కృతిపై ఉన్న ఇష్టాన్ని మోదీ 'ఎక్స్' వేదికగా అభినందించారు. రోమ్ నగరంలో కాశీ దృశ్యాలను చూడటం ఆనందంగా ఉందంటూ రాసుకొచ్చారు.

# కేంద్రంలో బీజేపీ పతనం ఖాయం

మొదటిపేజీ తరువాయి – బెనర్జీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ త్వరలోనే కేంద్రంలో అధికారం కోల్పోవడం ఖాయమని ఆమె జోస్యం చెప్పారు. మంగళవారం తన నివాసంలో టీఎంసీ ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన సువేందు అధికారి నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం మైనారిటీలు, వీధి వ్యాపారులను లక్ష్యంగా చేసుకుంటోందని మమత ఆరోపించారు. "మైనారిటీలపై దాడులు జరుగుతున్నాయి. వీధి వ్యాపారుల దుకాణాలను బుల్డోజర్లతో కూల్చివేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వం మన రాజ్యాంగ విలువలను కాలరాస్తోంది" అని ఆమె విమర్శించారు. ఇదే సమావేశంలో పాల్గొన్న టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ అభిషేక్ బెనర్జీ కూడా బీజేపీకి సవాల్ విసిరారు. తన ఇంటిలోని అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలంటూ కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చిన నోటీసులపై ఆయన ఘాటుగా స్పందించారు. "వారు నా ఇల్లు కూల్చినా సరే.. ఇలాంటి బెదిరింపులకు నేను తలొగ్గేది లేదు. ఏదేమైనా బీజేపీపై నా పోరాటం కొనసాగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఈ నోటీసులు జారీ చేసిన కేఎంసీ ఇప్పటికీ టీఎంసీ నియంత్రణలోనే ఉండటం గమనార్హం. ఈ సందర్భంగా సీఎం సువేందు అధికారిపై అభిషేక్ పరోక్షంగా విమర్శలు చేశారు. "కెమెరా ముందు డబ్బులు తీసుకుంటూ పట్టుబడిన వ్యక్తి ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యారు" అని 2014 నాటి నారద స్టింగ్ ఆపరేషన్‌ను ప్రస్తావిస్తూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం సృష్టిస్తున్న 'బుల్డోజర్ సంస్కృతి'కి వ్యతిరేకంగా మే 21 నుంచి కోల్‌కతాలో భారీ నిరసనలు చేపట్టాలని టీఎంసీ నిర్ణయించింది.

# రోమ్‌లో ప్రధాని మోదీ.. మరోసారి 'మెలోడీ' సెల్ఫీ వైరల్!



ప్రధాని నరేంద్ర మోదీ తన ఐదు దేశాల పర్యటనలో చివరి అంకానికి చేరుకున్నారు. నిన్న ఆయన ఇటలీ రాజధాని రోమ్‌లో అడుగుపెట్టగా, ఆ దేశ ప్రధాని జార్జియా మెలోనీ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రధాని మోదీతో తన స్నేహాన్ని చాటుతూ, "రోమ్‌కు స్వాగతం మిత్రమా!" అంటూ మెలోనీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. ఇటలీ, భారత జెండాల ఎమోజీలను కూడా జతచేశారు. ఈ పోస్ట్‌తో పాటు రోమ్‌లోని చారిత్రక కొలోసియం ముందు ప్రధాని మోదీతో కలిసి దిగిన సెల్ఫీని కూడా ఆమె పంచుకున్నారు. దాంతో ఈ సెల్ఫీ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. లక్షలాది వ్యూస్, వేలాది కామెంట్లతో ఇరు దేశాల నేతల మధ్య స్నేహబంధంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రధాని మోదీ, జార్జియా మెలోనీల స్నేహం గురించి సోషల్ మీడియాలో "చవీవశ్రీశీఎఱ" (మెలోడీ) అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవ్వడం కొత్తేమీ కాదు. గతంలో పలు సందర్భాల్లో వారిద్దరూ పంచుకున్న ఫొటోలు, వీడియోలు సంచలనం సృష్టించాయి. 2024 జూన్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా "హలో ఫ్రమ్ ది మెలోడీ టీమ్" అంటూ మోదీతో కలిసి మెలోనీ చేసిన వీడియో అప్పట్లో బాగా వైరల్ అయింది. దీనికి ప్రధాని మోదీ "భారత్–ఇటలీ స్నేహం వర్ధిల్లాలి!" అని బదులిచ్చారు. అంతకుముందు 2023లో దుబాయ్‌లో జరిగిన కాప్28 వాతావరణ సదస్సులో ఇద్దరూ కలిసి దిగిన సెల్ఫీని "కాప్28లో మంచి స్నేహితులు. చమెలోడీ" అనే క్యాప్షన్‌తో మెలోనీ పంచుకున్నారు. ప్రతీ సమావేశంలోనూ ఇలాంటి ఆత్మీయ ఫొటోలు వారి మధ్య ఉన్న బలమైన స్నేహాన్ని, రెండు దేశాల మధ్య పెరుగుతున్న సత్సంబంధాలను సూచిస్తున్నాయి.

# యువత తల్లిదండ్రులను దైవంలా భావిస్తే ఉన్నత శిఖరాలకు వెళతారు... మీూా మాధవరం కృష్ణారావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 20:** బుధవారం కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో... కూకట్పల్లి నియోజకవర్గ విద్యార్థి విభాగం వారితో సమీక్షా సమావేశం నిర్వహించారు...ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత నేడు అన్ని రంగాల్లో రాణిస్తూ తల్లి తండ్రులకు పుట్టిన ఊరికి మంచి పేరు తీసుకు రావాలని...అలాగే రాజకీయ రంగంలో కూడా ఉన్నత స్థానానికి వెళ్లాలంటే క్రమశిక్షణ... చేసే పనిలో నిబద్ధత ఉంటే కచ్చితంగా జీవితంలో ముందుకు వెళ్తామని...అందుకు ఉదాహరణ ఎంతోమంది గొప్ప నాయకులు ఉన్నారని... తాను కూడా ఒక కార్మికుడు గా జీవితాన్ని ప్రారంభించాను అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు...దీ=ూ పార్టీ యువతకు ప్రధాన ప్రాధాన్యత ఇస్తుందని భవిష్యత్తులో ఉన్నత స్థాయి చేరుకోవడానికి కేసీఆర్ గారు, కేటీఆర్ ఎప్పుడు అండగా ఉంటారని అన్నారు.. రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రానికి వచ్చినప్పుడు వేల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని.. కానీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగులను, యువతను పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు..అలాగే ూ×= పేరుతో తొలగిస్తున్న ఓట్లతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు... కూకట్పల్లి నియోజకవర్గంలో జూనియర్ కాలేజీ , స్కూల్స్ అభివృద్ధి చేసుకున్నాం అని ..సొంత నిధులతో నియోజకవర్గం లో ప్రభుత్వ పాఠశాలలో చదివే 11వేల మంది విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్,పుస్తకాలు తో కూడిన కిట్లు అందించామని గుర్తు చేశారు.... నేడు మారుతున్న సాంకేతిక అభివృద్ధినీ యువత అందిపుచ్చుకోవాలని... తల్లిదండ్రులనుదైవంలా భావించి వారి మాట వినాలని..అన్నారు...ఈ నెల 25వ తేదీన కేటీఆర్ అధ్యక్షతన జరుగు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సమావేశానికి హాజరు అయ్యి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు...ఈ కార్యక్రమంలోనియోజకవర్గ బి ఆర్ యస్ పార్టీ కో ఆర్డినేటర్ రెడ్డి సతీష్ అరోరా, మాజీ కార్పొరేటర్ పి. బాబూరావు, మైనారిటీ అధ్యక్షుడు గౌసిద్దీన్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, సురేష్ యాదవ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు జన్ను సాయి శ్రీనివాస్, యస్ సి సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు, యూత్ నాయకులు చైతన్య యాదవ్, అశ్వంత్, అభిలాష్ రావు, పవన్, రావెల్, మోజెస్, రూబెన్ సంతోష్ యాదవ్,ఉదయ్, నూర్, మోయిజ్ టి ఆర్ యస్ వి నాయకులు అక్షయ్, రాజు దుర్గాప్రసాద్, త్రినాథ్ సోషల్ మీడియా వారియర్స్ పుచ్చకాయల కిరణ్ కుమార్ రెడ్డి, వేణు, అహ్మద్, యోగిరాజ్, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# తెలంగాణ లో రెండు మూడు రోజులపాటు మస్తు ఎండలు!

జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచన

**నిజం న్యూస్ హైదరాబాద్:మే 20:** తెలంగాణ వ్యాప్తంగా రెండు మూడు రోజుల పాటు.. గరిష్ట ఉష్ణోగ్ర తలు అత్యధికంగా నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది, ఉత్తర తెలంగాణ ప్రాంత జిల్లాల్లో చాలా చోట్ల 45 డిగ్రీ సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు హెచ్చరిం చింది. రోజురోజుకూ ఎండల తీవ్రత, వడగాడ్పులు ప్రమాదకర స్థాయికి చేరుకుంటుండటంతో రాష్ట్ర ప్రభుత్వం అప్ర మత్తమైంది. ముఖ్యం గా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణో గ్రతలు నమోదవుతు న్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేప థ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో మారు తున్న వాతావరణ పరిస్థితులను ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తూ, అన్ని జిల్లాల కలెక్టర్ల ను అలర్ట్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,ను సీఎం ఆదే శించారు. తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు వడదెబ్బకు గురి కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ఆసుపత్రుల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను, అవసరమైన అత్య వసర మందులను భారీగా అందుబాటు లో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖను ఆదేశించారు. వడదెబ్బ బారిన పడిన బాధితులకు ఆసుపత్రుల్లో తక్షణమే మెరుగైన వైద్యం అందేలా ప్రత్యేక వార్డులను, సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు.



వేసవి కాలంలో ప్రజల కు అత్యంత అవసర మైన తాగునీరు, కరెంట్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి గట్టి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఎండల దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరిగినా లోడ్ షెడ్డింగ్ లేకుండా చూడాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలతో ముందు కు వెళ్లాలని సూచిం చారు. మున్సిపాలిటీ లు, కార్పొరేషన్ల పరిధి లో ప్రజల దాహార్తిని తీర్చడానికి తక్షణమే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ముదురు తున్న వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు కూడా తగిన జాగ్రత్తలు తీసు కోవాలని ముఖ్యమం త్రి కోరారు. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ ప్రయా ణాలు చేయవద్దని, ఇళ్లలోనే ఉంటూ సురక్షితంగా ఉండా లని రేవంత్ రెడ్డి, విజ్ఞప్తి చేశారు. ఉపాధి హామీ కూలీలు, నిరు పేదల విషయంలో అధికారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకో వాలని సీఎం సూచించారు.

# మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతులు ప్రారంభించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు



**నిజం న్యూస్ కూకట్పల్లి ప్రతినిధి, మే 20:** శ్రీ వాసవి కన్యకపరమేశ్వరి ట్రస్ట్, కె.పి.హెచ్.బి కాలనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ వ్యవస్థాపకులు కుమారస్వామి ఆహ్వానం మేరకు కూకట్ పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగడానికి ఇటువంటి ఉచిత శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "సమర్థ్" పథకం ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తూ ఉపాధి అవకాశాలు పెంపొందిస్తున్నదని పేర్కొన్నారు. కుట్టు శిక్షణ ద్వారా మహిళలు తమ కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవడంతో పాటు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగవచ్చని అన్నారు. అనంతరం శిబిరంలో శిక్షణ పొందిన మహిళలు తయారు చేసిన వివిధ రకాల దుస్తులను వడ్డేపల్లి రాజేశ్వరరావు పరిశీలించి వారి ప్రతిభ, నైపుణ్యాన్ని అభినందించారు.శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. అలాగే సమాజ సేవా కార్యక్రమాల్లో నిరంతరం ముందుండే శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ట్రస్ట్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ట్రస్ట్ సభ్యులు, మహిళలు, డివిజన్ సీనియర్ బిజెపి నాయకులు రఘురాం, వినోద్ గౌడ్, సూరిబాబు, ప్రేమ్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ

భక్తులకు దివ్యానుభూతి కలిగేలా విస్తృత ఏర్పాట్లు : టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర

సాంప్రదాయం, సంస్కృతి, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా బ్రహ్మోత్సవాలు

మే 28 నుండి జూన్ 5 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు

విద్యుద్దీపాలు, పుష్పాలంకరణలతో ముస్తాబుకానున్న ఆలయ ప్రాంగణం

తిరుపతి, **మే 20 నిజం న్యూస్:** నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను టీటీడీ ఈవో శ్రీ ముద్దాడ రవిచంద్ర బుధవారం తిరుపతిలోని ఈవో నివాస గృహంలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.

**భక్తులకు దివ్యానుభూతి కలిగేలా ఏర్పాట్లు : టీటీడీ ఈవో**

ఈ సందర్భంగా టీటీడీ ఈవో మాట్లాడుతూ మే 28 నుండి జూన్ 5 వరకు నారాయణవనంలో శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయని తెలిపారు. మే 24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, మే 27న అంకురార్పణం, జూన్ 4న దివ్య కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాలకు



సాంప్రదాయం, సంస్కృతి, ఆధ్యాత్మిక సమ్మేళనంగా ఏర్పాట్లు చేపట్టాలని, భక్తులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేపట్టేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వేసవి నేపథ్యంలో త్రాగునీరు, అన్నప్రసాదాల పంపిణీ, చలువ పందిళ్లు, వైట్ పెయింటింగ్, ఆలయ పరిసరాల్లో ఆహ్లాదకర రంగోలీలు, విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సాంప్రదాయ పెయింటింగ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టాలని సూచించారు.

**వాహన సేవలు**

బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 7.30 నుండి 9.30 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు స్వామివారు, అమ్మవారు వివిధ దివ్య వాహనాలపై విహరించి భక్తులకు అనుగ్రహ దర్శనం ఇవ్వనున్నారు.

మే 28 -- ధ్వజారోహణం, పెద్దశేష వాహనం

మే 29 -- చిన్నశేష వాహనం, హంస వాహనం

మే 30 -- సింహ వాహనం, ముత్యపుపందిరి వాహనం

మే 31 -- కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం

జూన్ 1 -- మోహినీ అవతారం, గరుడ వాహనం

జూన్ 2 -- హనుమంత వాహనం, గజ వాహనం

జూన్ 3 -- సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం

జూన్ 4 -- రథోత్సవం, అశ్వవాహనం, కల్యాణోత్సవం

జూన్ 5 -- చక్రస్నానం, ధ్వజావరోహణం

జూన్ 4న వైభవంగా శ్రీ స్వామివారి కల్యాణోత్సవం

జూన్ 4వ తేదీ రాత్రి 8.30 గంటలకు నిర్వహించే శ్రీ స్వామివారి కల్యాణోత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ ఈవో అధికారులను ఆదేశించారు. కల్యాణోత్సవానికి విచ్చేసే భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం, ప్రసాదాల పంపిణీ, కూర్చునే ఏర్పాట్లు, భద్రతా చర్యలు సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆలయాల డిప్యూటీ ఈవో శ్రీమతి నాగరత్న, ఆలయ అర్చకులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితర అధికారులు పాల్గొన్నారు. టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే విడుదల చేయబడినది

# కుప్పం ప్రసన్న తిరుపతి గంగమ్మకు వైభవంగా శ్రీవారి సారె

రాష్ట్ర సౌభాగ్యం కోసం అమ్మవారిని ప్రార్థించిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు

విశ్వరూప దర్శనానికి పోటెత్తిన భక్తజనం



తిరుమల, **మే 20 నిజం న్యూస్:** చిత్తూరు జిల్లా కుప్పంలోని ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు శ్రీవారి సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ప్రతి ఏడాది వైభవంగా నిర్వహించే ఈ జాతరలో అమ్మవారికి టిటిడి తరపున 2014 సంవత్సరం నుండి శ్రీవారి సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం అమ్మవారి విశ్వరూప దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని ముఖ్యమంత్రివర్యులు అమ్మవారిని ప్రార్థించారు. అంతకుముందు టీటీడీ అదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి టీటీడీ శ్రీవారి సారెను ముఖ్యమంత్రి దంపతులకు అందజేశారు. ఏడాదికి ఒక్కసారే కల్పించే అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని తిలకించేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి భక్తి పరవశంలో మునిగిపోయారు. ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శ్రీ శాంతారామ్, టిటిడి డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, టీటీడీ అర్చకులు మరియు అధికారులు పాల్గొన్నారు. టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారిచే జారీ చేయబడినది.

# ఎయిర్ గట్ల మండలంలో రైతుల ధాన్యాన్ని, వెంటనే కొనుగోలు చేయాలి

కొనుగోలు కేంద్రాలలో హమాలీల కొరత, గన్ని బ్యాగుల, లారీల కొరత తీర్చాలి....



మెండోరా మండల **మే 20 నిజం న్యూస్:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం ఏర్గట్ల మండలంలోని ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ సొసైటీ ల పరిధిలోని ఎనిమిది గ్రామాలలో రైతులు అరుగాలం కష్టపడి పండించిన వరి దిగుబడి ధాన్యాన్ని, రెండు సొసైటీలు కొనుగోలు కేంద్ర ల ద్వారా వరిని కొనుగోలు చేస్తునందుకు సంతోషమే,కానీ వెంటనే లారీలు,తదితర వాహనాలను ఏర్పాటు చేసి వరి బస్తా లను తరలించలని కోరుతూ ఎయిర్ గట్ల మండలంలోని బట్టాపూర్ గ్రామ ఉప సర్పంచ్ మూడ్ దయానంద్ తాసిల్దార్ మల్లయ్యకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ మాట్లాడుతూ.. రైతులు పండించిన వరి దిగుబడి కొన్నిచోట్ల సొసైటీ ల ద్వారా హమాలీలు బస్తాలు నింపుతున్నారని, మరికొన్ని చోట్ల వరి దిగుబడి ను హమాలీల కొరత ఉండడం తో, వరిను బస్తాల్లో నింపకుండా అలాగే ఉన్నాయని,దీనితో రైతులు ఇబ్బంది కి గురవుతున్నారని,ఇప్పటివరకు నింపి సిద్ధం చేసిన వరి బస్తాలను లారీలను ఏర్పాటు చేసి వెంటనే తరలించాలని, దీనీతో పాటు ఇప్పటివరకు బస్తాలు నింపని వాటిని కూడా సొసైటీల ద్వారా హమాలీల సంఖ్య పెంచి వరి ధాన్యం బస్తాల్లో నింపించి, వాటినీ కూడా తరలించాలని ఆయన భట్టాపూర్ గ్రామ ఉపసర్పంచ్ తాసిల్దార్ కు మొరపెట్టుకున్నారు. అంతే గాక బట్టా పూర్ తో పాటు పలు గ్రామాల్లో హమాలీల కొరత ఎక్కువ గా ఉందని, హమాలీల సంఖ్య లారీల సంఖ్య పెంచాలని, ఆయన తాసిల్దార్ మల్లయ్య కు విజ్ఞప్తి చేశారు.

# మై భారత్ ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక దినోత్సవం





వనపర్తి బ్యూరో **మే 20 నిజం న్యూస్:** వనపర్తి జిల్లా కేంద్రంలోని మై భారత్ ఆధ్వర్యంలో జాతీయ సాంకేతిక దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రగతి ఐటిఐ కళాశాల నందు విద్యార్థులకు ఎస్ఐ రైటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ల మై భారత్ యువజన అధికారి కోట నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో పోక్రాన్ పరీక్షలతో పెరిగిన భారత కీర్తి ఎంతో విలువైనది వాజ్పేయి ప్రధానిగా ఉన్న సమయంలో ఫోక్రాన్ అనుపరీక్షలను విజయవంతంగా నిర్వహించి భారత కీర్తిని చాటారని అంతేకాకుండా సాంకేతిక పరిజ్ఞాన విషయాలను ఎన్నో రకాలుగా నైపుణ్యాలను నేర్చుకుని వ్యక్తిగతంగా మరియు దేశ ఔన్నత్యాన్ని పెంచే దిశగా మనం ఎదగాలని సూచించారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం సాంకేతిక కోర్సులలో విద్యార్థులకు అన్ని రకాలుగా ఉపయోగపడే విధంగా పరికరాలను కొత్త రకమైన కోర్సులను అందిచడం జరిగిందని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. తదనంతరం ఎస్సై రైటింగ్ లో ప్రథమ, ద్వితీయ వచ్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది అట్టి కళాశాల ప్రిన్సిపాల్ ని యాజమాన్యాన్ని సన్మానించడం కూడా జరిగింది.జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా గుర్తుగా విద్యార్థులతో కలిసి చెట్లను నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మై భారత్ జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్ గౌడ్ జిల్లా వాలంటీర్ అభిలాష్ హౌదేకార్, గజరాజుల తిరుమలేష్, కళాశాల ప్రిన్సిపాల్ వారి బృందం పాల్గొనడం జరిగింది.

# మాజీ ఎమ్మెల్యే వర్ధంతి విజయవంతం చేయాలి

అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్



వనపర్తి బ్యూరో **మే 20 నిజం న్యూస్:** మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు గుమ్మడం జయరాములు 41 వర్ధంతి అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మే 24న జరుపబడును. అందరూ విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ మాట్లాడుతూ వనపర్తికి సేవ చేసిన బడుగు బలహీన వర్గాల ఎమ్మెల్యే లను మర్చిపోయిన ప్రజాప్రతినిధులకు గత పది సంవత్సరాలుగా కళ్ళు తెరిపించిన అఖిలపక్ష ఐక్యవేదిక ముందుకు వచ్చి మాజీ ఎమ్మెల్యేల జయంతులు, వర్ధంతిలు చేసి ప్రజలకు కూడా క్యాలెండర్ ద్వారా తెలిపిందని. అందుకు అనుగుణంగా మాజీ ఎమ్మెల్యే కీర్తిశేషులు గుమ్మడం జయరాములు 41 వర్ధంతి అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో మర్రికుంట పాలకేంద్రం దగ్గర 24వ తారీఖు ఉదయం 7:30 నుంచి 9 గంటల వరకు జరుగుతుందని. అన్ని ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు, ఆయన కుటుంబ సభ్యులు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొంటారని, ఈ సందర్భంగా ప్రజలకు, పత్రికా, మీడియా విలేకరులకు ప్రత్యేక ఆహ్వానం పలుకుతున్నామని సతీష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టిడిపి ఎన్నికల అధికార ప్రతినిధి కొత్త గొల్ల శంకర్, బిఎస్పి నాయకులు మైబూస్, లోక్సత్తా నాయకులు రాజ్ కుమార్, టిఆర్ఎస్ నాయకులు శివకుమార్ రాములు, రాజనగరం రామస్వామి, చందు, రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షుడికి నాయకుల ఆశీస్సులు





మెండోరా **మే 20 నిజం న్యూస్:** మెండోరా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన బడాల సాయరెడ్డి ఈరోజు గౌరవ ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు నగేష్ రెడ్డిని కూడా కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని బడాల సాయరెడ్డి తెలిపారు. నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజం
దృష్టి తెలుగు న్యూస్
గురువారం 21-05-2026

# సావాసం



"అమ్మగారూ.."రాజమ్మ పిలుపుతో, చేనంతా కలియ చూస్తున్న జానకమ్మ ఉలిక్కిపడింది. "ఈ మిరప చేను మాదే అమ్మగారూ! అరెకరం ఉంటది. మిర్చి ఏరడానికి కూలి మదుసులు దొరుకుతలేరు. అందరి తోటలు ఇప్పుడే కోతకొస్తయి కదా! గందుకని కైకిలికి కొద్దిమందే దొరికింద్రు" అన్నది రాజమ్మ. మిరప తోటలో ఎర్రగా పండిన మిరపపండ్లు ఎంతో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. ఊరికి దగ్గరలోనే ఉన్నది ఆ చేను. "ఏం పని లేకుండ, ఇంటికాడ ఉత్తగనే కూసుంటే ఏం తోస్తది అమ్మగారూ! పాత ఇసయాలన్నీ యాదికొచ్చి గుబులైతుంటది. జర గిట్ల అటు, ఇటు తిరుగుతా ఉంటే మదికి కాస్త ఊరట వస్తది. గందుకనే నిన్ను ఇక్కడికి తోలుకొచ్చిన" అన్నది రాజమ్మ. లింగాపురం చిన్న గ్రామం. అతని కుమారుడైన వరదాచార్యులు కూడా తండ్రితోపాటు గుడికి వెళ్లేవాడు. అలా వెళుతూ అర్చకత్వం, పౌరోహిత్యం నేర్చుకున్నాడు. ఆ ఊరిలో శ్రీవైష్ణవుల కుటుంబాలు, బ్రాహ్మణుల కుటుంబాలు మరో నాలుగు ఉన్నాయి. కాలక్రమేణా దొర ఏర్పాటు చేసిన గుడిమాన్యం, ఊరి రాజకీయాలలో హరించుకుపోయింది. తిరువెంగళాచార్యుల అనంతరం వరదాచార్యులు అర్చకత్వానికి వచ్చేసరికి.. గుడికి వచ్చే ఆదాయం శూన్యమైపోయింది. గుడిలో రోజూ దీపం ముట్టించాలన్నా.. వరదాచార్యులే తన చేతి చమురు వదిలించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరదాచార్యులకు జానకమ్మతో వివాహం జరిగిన తర్వాత, కుటుంబ జరుగుబాటే కష్టమైపోయింది. గుడి అర్చకత్వంతోను, పౌరోహిత్యంతోను, ఒక కుటుంబం జీవించగలగడం చాలా కష్టమని అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. ఈలోగా కొడుకు వెంకటాచార్యులు, కూతురు గోదాదేవి జన్మించారు. "ఏమండీ! ఈ అర్చకత్వంతో మనం బతకడం, పిల్లలను చదివించుకోవడం కష్టం అవుతూ ఉంది కదండీ. మన ఊర్లో ఉన్న మన బంధువులు, బ్రాహ్మణ కుటుంబాలు కూడా పట్నానికి వలస పోతున్నారు కదండీ. మనం కూడా పట్నానికి వెళ్లి బతుకుదెరువు వెతుకుందామండీ" అంటూ బతిమిలాడింది జానకమ్మ. "ఈ వరదరాజ స్వామి గుడి, అర్చకత్వం మా తండ్రిగారి కోరిక మేరకు మన కుటుంబానికి లభించిన అదృష్టం. ఇదంతా వదిలేసి, ఇప్పుడు అర్ధంతరంగా వెళ్లిపోతే ఆయన ఆత్మ శాంతిస్తుందంటావా జానకీ " అన్నాడు వరదాచార్యులు. "ఆత్మల శాంతికోసం ఆలోచిస్తే, మన ఆత్మారాముడు ఎలా శాంతిస్తాడండీ? పిల్లలకు రెండు పూటలా కడుపునిండా తిండి పెట్టుకోవాలి కదా? పట్నంలో ఏదో ఒక పని చేసుకొని బతకవచ్చు. ఈ అరుపులకు, అలికిడికి రాజమ్మ బయటికి వచ్చింది. "ఏమైందిరా మల్లిగా! అయ్యగారికి ఏమైంది?" అడిగింది రాజమ్మ. "ఏమోనత్తా! గంట కొట్టుకుంటా కొట్టుకుంటా గట్లనే పక్కకు ఒరిగిపోయిండు. ఎంత పిలిచినా పలుకుతలేదు" అన్నాడు మల్లిగాడు. "అమ్మగారూ పద.. పొయ్యి చూద్దాం" అంటూ జానకమ్మను తీసుకొని వెళ్లింది రాజమ్మ. గుడిలో అచేతనంగా పడి ఉన్నాడు వరదాచార్యులు. రాజమ్మ మల్లిగాణ్ని పంపించి, ఆ ఊర్లో ఉన్న ఆర్ఎంపీ డాక్టరును పిలిపించింది.

డాక్టర్ వచ్చి పరీక్షించాడు.

"ఇది పక్షవాతం స్ట్రోక్ లాగా ఉన్నదమ్మా ! పక్కూరు గవర్నమెంట్ ఆసుపత్రికి తీసుకుపోండి" అని చెప్పి వెళ్లిపోయాడు. రాజమ్మ తన భర్తను పిలిపించి, బండి కట్టించి.. అయ్యగారిని పక్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లింది. జానకమ్మ అంటే రాజమ్మకు చాలా ఇష్టం. ఇద్దరూ దాదాపు ఒకే ఈడువారు. దాదాపు ఒకే సంవత్సరం పెళ్లయి అత్తగారింటికి వచ్చారు. ఆ ఇద్దరి మధ్య స్నేహం బాగా అల్లుకుపోయింది. జానకమ్మ శ్రీవైష్ణవుల ఇంటిపిల్ల కాబట్టి.. రాజమ్మ ఆమెను ఎప్పుడూ గౌరవంగా 'అమ్మగారూ' అని పిలిస్తే.. జానకమ్మ ఆప్యాయంగా 'రాజమ్మా!' అని పిలిచేది. రాజమ్మ సహకారంతో వరదాచార్యులకు చికిత్స చేయించింది జానకమ్మ. అతనికి పక్షవాతం అని డాక్టర్లు చెప్పారు. మంచంలో ఉలుకుపలుకు లేకుండా పడి ఉన్న చెట్టంత మనిషిని చూస్తుంటే గుండెలు ఆర్చుకుపోతున్నాయి జానకమ్మకు. ఇంట్లో తిరుగుతున్న ఇద్దరు చిన్నపిల్లలను చూస్తూ ఏం చేయాలో, జీవితాన్ని ఎలా గడపాలో తెలియక దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. పూజారి అక్షతలు చల్లి ఆశీర్వచనాలు పలికేవాడు. ఆ సందర్భంలో ఆ భక్తులలో కనిపించే గౌరవ మర్యాదలు చూస్తున్న వెంకటాచారికి, తన తండ్రి ఎంతో గొప్పవాడని, సాక్షాత్తూ భగవంతుడే అన్న తలంపు కలిగేది. తాము ఎంతో గొప్పవాళ్లం కాబట్టే, అలా గౌరవిస్తున్నారని భావన కలిగేది. కానీ, పక్షవాతం వచ్చి మంచాన పడిన తండ్రిని చూస్తూ ఉంటే.. అమ్మ కూలికి వెళ్లి తెచ్చిన జొన్న గటకతో కడుపులు నింపి, ఆకలి తీర్చుకుంటూ ఉంటే.. జీవితంలో మరోకోణం కూడా ఉంటుందని వెంకటాచార్యులకు అర్థమైంది. ఈ గింజలు గట్క వొండు. అయ్యగారికి, ఈ పిల్లలకు ఇంత తినిపించు. బాధపడతా కూసుంటే ఆకలి తీరదు కదా అమ్మా" అంటూ ఓదార్చి వెళ్లిపోయింది రాజమ్మ.

అప్పటికి రెండు రోజులైంది ఆ ఇంట్లో పొయ్యి రాజేసి. జానకమ్మకు ఆ గింజలే అమృతం లాగా అనిపించింది. జొన్న గటక తినడం పిల్లలకు ఎంతో కష్టమైంది. కొడుకు వెంకటాచార్యులు జొన్న గటక చూసి.. "అమ్మా! ఇది మనం తినే అన్నంలాగా లేదు కదమ్మా" అంటూ మొహం విరిచాడు. "నాన్నగారికి ఆరోగ్యం తొందరగా నయం కావాలంటే.. ఈ ఆహారమే ఇవ్వాలని డాక్టరు చెప్పాడు బాబూ. మరి నాన్నగారికి త్వరగా నయం కావాలి కదా నాన్నా" అంటూ నచ్చచెప్పింది జానకమ్మ. కష్టాల ఊబిలో ఉన్న జానకమ్మకు ఎలాగైనా సహాయం చేయాలని అనుకున్నది రాజమ్మ. కానీ ఏం చేయాలో అర్థం కాలేదు. అదే విషయం తన భర్తతో మాట్లాడింది. అతడి సలహా నచ్చింది ఆమెకు.

మర్నాడు రాజమ్మ తాను చేనుకు వెళ్లేటప్పుడు..

"జానకమ్మ గారూ! నాతోపాటు చేనుకు పోదాం రా. ఊరికెనే ఇంట్ల కూసుంటే గుబులుగ ఉంటది" అంటూ తనవెంట చేనుకు తీసుకెళ్లింది. అక్కడ ఒక గంట తర్వాత జానకమ్మకు విసుగు అనిపించింది. రాజమ్మ ఒక గంప తెచ్చి జానకమ్మకు ఇచ్చింది. "నాకు కాస్త సాయం చెయ్యండి అమ్మగారూ! ఈ పండు మిరపకాయలు తెంపి బుట్టలో వెయ్యి. ఏదో పని చేస్తా ఉంటే.. మనసు తెరిపిన పడుతది కదా!" అని ప్రోత్సహించింది. చేనులో కూలోళ్లను చూస్తూ కూర్చుంటే, నిజంగానే విసుగు చెందిన జానకమ్మకు.. కాస్త ఏదైనా పని చేస్తుంటే బావుండు అనిపించింది. తనుకూడా వాళ్లతో పాటు కూలి పనికి వెళుతున్నానని. కానీ, ఆ పని కూడా చేయకపోతే, ఆ కాసిన్ని తిండి గింజలు కూడా దొరకవనే సత్యం కూడా అవగతమైంది ఆమెకు.

ఆ విధంగా జానకమ్మను తన పరిధిలోకి తీసుకొచ్చుకున్నది రాజమ్మ.

"మీలాంటి పెద్దోల్లకు సాయపడితే మాకు పోయిన జన్మల పాపాలు పోతాయట తల్లీ" అంటూ జానకమ్మను తనవెంట కూలికి తీసుకొని పోయేది రాజమ్మ. కాలచక్రం తిరిగి పోయింది. వెంకటాచార్యులు చదువు పూర్తయ్యాక.. ప్రభుత్వ ఉద్యోగం దొరికింది. హాస్పిటల్లో రాజమ్మను చూడ్డానికి వెళ్లిన జానకమ్మ.. తన కిడ్నీని రాజమ్మకు ఇస్తానని చెప్పింది. డాక్టర్లు పరీక్ష చేసి.. ఆమె కిడ్నీ సరిపోతుందని చెప్పారు. కానీ, జానకమ్మకు ఇంట్లోంచి వ్యతిరేకత ప్రారంభమైంది.

వరదాచార్యులు, అతని వియ్యంకుడు పరమేశం దీనిని వ్యతిరేకించారు.

"తక్కువ కులం వాళ్లతో సహవాసం చేయడమే దోషం. నిత్యాగ్ని హోత్రంలాంటి మన శ్రీ వైష్ణవ కుటుంబాలకు, ఆ తక్కువ కులం వాళ్లతో సావాసం ఏమిటి? ఇంతకాలం అడిగేవాళ్లు లేరనేగా! ఇప్పుడు ఈ ఇంటికి పిల్లనిచ్చిన వ్యక్తిగా నేనందుకు ఒప్పుకోను. అసలు ఆ తక్కువ కులం వాళ్లతో స్నేహమే నాకు ఇష్టం లేదు. మనవి సంశ్రయణాలు చేసిన సంప్రదాయ కుటుంబాలు. నిత్యం పూజలు, పునస్కారాలు చేసే శ్రీ వైష్ణవులం. ఈ కుల భ్రష్టతకు నేను ఒప్పుకోను. మనవాళ్లు కిడ్నీలు కూడా అలాంటి వారికి ఇవ్వకూడదు" అంటూ ఒంటికాలు మీద లేచాడు పరమేశం. తన బిడ్డను వెంకటాచార్యులకు ఇచ్చి పెళ్లి చేశాడు కాబట్టి.. ఆ విధంగా తన ఆధిక్యతను నిలుపుకోవాలని అతని ప్రయత్నం. నివ్వెరపోయిన జానకమ్మ.. వెంకటాచార్యుల వైపు చూసింది. ఆమె కళ్లలో నీళ్లు లేవు. గత కాలంలో తాము పడిన కష్టం, రాజమ్మతో ఆమె స్నేహం, రాజమ్మ చేసిన సహాయ సహకారాలు అన్నీ కనిపించాయి వెంకటాచార్యులకు. నెమ్మదిగా లేచి వచ్చి, తల్లి భుజం మీద చేయి వేశాడు. తల్లిని దగ్గరికి పొదువుకున్నాడు. ఆమె నుదుట ముద్దు పెట్టుకున్నాడు.

"మామయ్యా! మీ ఆరాటంలో అర్థం ఉన్నది. కానీ మానవత్వం లేదు. మా నాన్నగారికి జబ్బు చేసి, మంచాన పడి ఉన్న రోజున..ఈ విషయంలో మా అమ్మ ఏ నిర్ణయం తీసుకుంటే, దానికి అందరం బద్ధులమై ఉండాలి. ఇష్టం లేనివాళ్లు ఇప్పుడే వెళ్లిపోవచ్చు" అన్నాడు వెంకటాచారి ప్రశాంతంగా.

తూటాల్లాగా వెలువడిన ఆ మాటలలో ఒక నిర్దిష్టమైన నిర్ణయం కనిపించింది. పరిమళ లోపలికి వెళ్లి బ్యాగు తెచ్చి తండ్రికి ఇచ్చి.. గుమ్మం దాకా సాగనంపి వచ్చింది. చెట్టంత కొడుకు నీకు అండగ ఉన్నడు. ఏడవకుండ్రి. కండ్లు తుడ్సుకోండి!" అన్నది రాజమ్మ. "నీ సావాసమే నాకు కొండంత అండ రాజమ్మా!" అంటూ చీర కొంగుతో కళ్లు తుడుచుకున్నది జానకమ్మ.


నెల్లుట్ల రుక్మిణి

కష్టాల్లో ఉన్నవారికి ఎలాగైనా సాయం చేయాలనే తపన.. మానవ జీవితానికి విలువను తీసుకొస్తుంది. అలాంటి తపనతో ఉన్న ఓ నిరుపేద స్నేహితురాలికి, ఆమె ఆప్యాయతకు, స్నేహబంధానికి, సామాజిక అంతరాలు అడ్డురావని చెప్పే కథ.. 'సావాసం'. రచయిత్రి నెల్లుట్ల రుక్మిణి. మనుషులను, జీవితాలను, ప్రకృతిని పరిశీలించడం.. చిన్నప్పటినుంచే అలవాటు చేసుకున్నారు. 50 ఏళ్ల కిందట.. ఇల్లెందు క్రాంతి స్కూలు ప్రిన్సిపాల్‌గా పని చేసినప్పుడు.. పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేసేవారు. ఆ పిల్లల తల్లిదండ్రులతో కలిగిన పరిచయం.. వీరిలో కథలు రాయాలనే తలంపునకు కారణమైంది. వారు చెప్పిన జీవిత వెతలనే, కథలుగా మలిచేందుకు ప్రయత్నించారు. వీరు రాసిన పలు కథలు.. కొత్తగూడెం రేడియో కేంద్రంలో మూడేళ్లపాటు ప్రసారమయ్యాయి. అనేక కథలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. 'వెన్నెల పూలు' బాలగేయ సంపుటి, 'బతుకు ఎతలు' కథల సంపుటిని ముద్రించారు. అనేక బహుమతులు, అవార్డులు, సన్మానాలు అందుకున్నారు. నిర్మాతగా.. శ్రీ వెంకటేశ్వర మహత్యం, ఈ రాత్రి గడిస్తే చాలు చిత్రాలను నిర్మించారు.


# ఈ ఐదు నగరాలు ప్రపంచంలోనే సంపన్నమైనవి.. అన్ని సౌకర్యాలకు నెలవు..











ప్రపంచవ్యాప్తంగా అనేక నగరాలు ఉన్నాయి. వీటిలో కొన్ని పర్యాటక రంగంలో బెస్ట్, కొన్ని టెక్నాలజీలో బెస్ట్. అయితే చాల సిటీస్ మంచి జీవన వైవిధ్యం కలిగి ఉన్నాయి. అలాగే ప్రపంచంలో సంపన్న నగరాలు కూడా ఉన్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా అనేక మందికి విద్య, ఉద్యోగంతో పాటు అన్ని అనువైన సౌకర్యాల అందించే నగరాలు కొన్ని మాత్రమే ఉన్నాయి. వాటిలో టాప్ 5 నగరాలూ ఏంటి.? ఈ స్టోరీలో తెలుసుకుందామా..

**న్యూయార్క్ నగరం,** యూనిట్ స్టేట్స్ అఫ్ అమెరికాలోని న్యూయార్క్ ఇప్పటికీ అగ్రస్థానంలో ఉంది. ఇది చాలా మంది బిలియనీర్లకు నిలయం. బలమైన ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, టెక్ మార్కెట్‌ను కలిగి ఉంది. ప్రపంచ దేశాల నుంచి చాలామంది ప్రజలు ఇక్కడికి జాబ్స్ చేయడానికి వస్తారు.

**టోక్యో, జపాన్:** టోక్యో ఆసియాలో బలమైన నగరంగా మిగిలిపోయింది, అనేక ధనిక కుటుంబాలు, కంపెనీలు ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ పాత సంస్కృతి, కొత్త వ్యాపారం మిశ్రమంగా ఉన్నాయి. జపాన్ ఎప్పుడు టెక్నాలజీలో ప్రపంచదేశాల అన్నింటికంటే ముందే ఉంటుంది.

**శాన్ ఫ్రాన్సిస్కో బే ఏరియా,** సిలికాన్ వ్యాలీతో సహా బే ఏరియా ఇప్పటికీ గూగుల్, ఆపిల్, ఫేస్‌బుక్ వంటి టెక్ దిగ్గజాలకు కేంద్రంగా ఉంది. ఇక్కడ చాలా మంది టెక్, స్టార్టప్‌లలో పనిచేస్తున్నారు. ఈ ప్రాంతం లక్షాధికారులతో నిండి ఉంది.

**లండన్,** లండన్ ఒక ప్రపంచ ఆర్థిక కేంద్రం. అనేక మంది సంపన్నులకు నిలయం. దీనికి బ్యాంకింగ్, ఫ్యాషన్, రియల్ ఎస్టేట్‌తో బలమైన సంబంధాలు ఉన్నాయి. ఈ నగరం విద్యారంగానికి ప్రసిద్ధ చెందింది. భారత్ సహా అనేక దేశాల విద్యార్థులు ఈ సిటీకి చదువుకోవడానికి వెళ్తారు.

**సింగపూర్:** సింగపూర్ ఆసియాలో ఒక పెద్ద ధన కేంద్రంగా మారింది. దాని తక్కువ పన్నులు, శుభ్రమైన వ్యవస్థ, బలమైన బ్యాంకింగ్ దీనిని ధనవంతులు, వ్యాపారాలకు అనువైనదిగా చేస్తాయి. తక్కువ పన్ను కారణం అనేక దేశాల ప్రజలు ఇక్కడకి పని కోసం వెళ్తుంటారు.

# మజ్జిగలో చిటికెడు ఇంగువ కలిపి తాగితే ఏం జరుగుతుందో తెలుసా..?














మజ్జిగతో కలిగే లాభాలేంటో దాదాపు ప్రతి ఒక్కరికీ తెలిసిందే, అయితే, మజ్జిగని నేరుగా తాగే బదులు ఓ పదార్థం కలిపి తాగితే బోలెడన్నీ లాభాలు ఉన్నాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇంగువ శరీరంలో ఎసిడిటీని తగ్గిస్తుంది. ఇంగువ ఇమ్యూనిటీని బలపరుస్తుంది. రోజూ ఉదయం ఖాళీ కడుపుతో మజ్జిగ తాగితే ఇంగువ తాగితే చాలా మంచిది. ఇంగువలో రోగ నిరోధకత, యాంటీ ఆక్సిడెంట్లు చాలా ఎక్కువ. ఇంగువతో బీపి తగ్గుతుంది. రక్త ప్రసరణ మెరుగ్గా మారుతుంది. రక్తం గడ్డకట్టడం లాంటి సమస్యలు ఉండవు. దీని వల్ల స్ట్రోక్, గుండె సమస్యలు, ప్రమాదకర సమస్యలు రావు. ఇంకా మరెన్నో లాభాలు ఉన్నాయని అవన్నీ తెలియాలంటే.. పూర్తి వివరాల్లోకి వెళ్లాల్సిందే...

మజ్జిగలో ఇంగువ కలుపుకుని తాగితే జీర్ణక్రియకు అద్భుతంగా ఉపయోగపడుతుంది. మజ్జిగలో కొద్దిగా ఇంగువ కలుపుకుని తాగితే గ్యాస్, ఉబ్బరం, ఎసిడిటీ సమస్యలు తగ్గుతాయి. పరగడుపున మజ్జిగ తాగితే చాలా మంచిది. జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఇంగువ కలిపితే మరింత ఉపయోగం. ఇంగువ కలిపి తాగితే చాలా ప్రయోజనకరంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

గ్లాసు మజ్జిగలో 50-80 కేలరీలు ఉంటాయి. నెమ్మదిగా కరగడం వల్ల కడుపు నిండుగా ఉన్నట్టుంటుంది. మజ్జిగలో ప్రో బయోటిక్స్ పెద్దమొత్తంలో ఉంటాయి. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి. బరువు తగ్గించే ఉపయోగపడుతుంది.

గ్లాసు మజ్జిగలో 50-80 కేలరీలు ఉంటాయి. నెమ్మదిగా కరగడం వల్ల కడుపు నిండుగా ఉన్నట్టుంటుంది. మజ్జిగలో ప్రో బయోటిక్స్ పెద్దమొత్తంలో ఉంటాయి. జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి. బరువు తగ్గించేందుకు ఉపయోగపడుతుంది.

మజ్జిగలో జీర్ణవ్యవస్థ మెరుగుపర్చే ప్రో బయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇంగువ జీర్ణశక్తికి సంబంధించిన సమస్యలకు మందుగా పని చేస్తుంది. భోజనం చేసిన తరువాత చిటికెడు ఇంగువ, చిటికెడు ఉప్పును మజ్జిగలో కలిపి తీసుకుంటే పొట్టలో గ్యాస్ సమస్య గ్గుతుంది. దీనివల్ల ఆహారం చక్కగా జీర్ణమవుతుంది.

మజ్జిగలోని లాక్టోస్ కొంతమందికి అలర్జీలు, జీర్ణ సమస్యలకి కారణమవుతుంది. దీని వల్ల కొంతమందికి కడుపునొప్పి, విరోచనాలు, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయి. కడుపు నొప్పి, విరోచనాలను తగ్గించడానికి కొద్దిగా ఇంగువ కలిపి తీసుకుంటే మంచిది. మెరుగైన జీర్ణక్రియతో పాటు ఆరోగ్యం బాగుంటుంది.

మ్మిరి కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలుంటే దీర్ఘకాలిక వ్యాధుల మందులు తీస్నుకునేవాళ్లు మజ్జిగ ఇంగువ తాగకూడదు.

ఇంగువ కలిపిన మజ్జిగ తీసుకోవటం వల్ల జీర్ణక్రియ మెరుగ్గా మారుతుంది. కడుపు నిండుగా ఉంటుంది. దీంతో అనారోగ్యకర ఆహారం ఎక్కువగా తినకుండా ఉంటారు. ఈ కారణంగానే బరువు తగ్గుతారు. ఈ రెండింటిని కలిపి తీసుకుంటే మహిళల్లో పీరియడ్స్ టైమ్‌లో వచ్చే నొప్పి, తిమ్మిరి కూడా తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్య సమస్యలుంటే దీర్ఘకాలిక వ్యాధుల మందులు తీస్నుకునేవాళ్లు మజ్జిగ ఇంగువ తాగకూడదు.

# మీ ఇంట్లో దోమలు ఎక్కువగా ఉన్నాయా..? ఈ నాచురల్ టిప్స్‌ను పాటించండి చాలు..!



వర్షాకాలం వచ్చేసింది. సీజనల్ వ్యాధులు ఇప్పటికే చాలా మందికి వస్తున్నాయి. ఈ సీజన్ లో దోమలు కూడా దాడి చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇలాంటి వాతావరణం ఉంటే దోమలు వృద్ధి చెందడం చాలా సులభతరం అవుతుంది. దీంతో దోమలు పుట్టలు పుట్టలుగా తయారై మన ఇండ్లలోకి వచ్చి మనపై దాడి చేస్తాయి. రాత్రి, పగలు తేడా లేకుండా మన రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తుంటాయి. దీంతో మనకు అనేక విష జ్వరాలు, ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. అయితే కొన్ని రకాల సహజసిద్ధమైన చిట్కాలను పాటిస్తే దోమల బెడద ఉండదు. దోమలను తరిమి కొట్టవచ్చు. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం. దోమలను తరమాలంటే ముందుగా దోమలు లేకుండా చూడాలి. ఇంటి చుట్టు పక్కల లేదా ఇంట్లో నీరు నిల్వ ఉండకుండా చేయాలి. దోమలకు ఇవే ఆవాసాలు కనుక నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చేయాలి.

## ఆయిల్స్..

చెత్తను కూడా శుభ్రం చేయాలి. ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్మికులకు చెత్తను అందించాలి. ఇక దోమలను తరిమేందుకు యూకలిప్టస్ ఆయిల్ అద్భుతంగా పనిచేస్తుంది. ఒక స్ప్రే బాటిల్‌లో కొన్ని నీళ్లను తీసుకుని అందులో కొన్ని చుక్కల యూకలిప్టస్ ఆయిల్ వేయాలి. తరువాత బాగా కలపాలి. దీన్ని దోమలు ఉన్న చోట స్ప్రే చేయాలి. దీంతో దోమలు పారిపోతాయి. సిట్రొనెల్లా ఆయిల్ కూడా ఇలాగే అద్భుతంగా పనిచేస్తుంది. దీన్ని కూడా నీటిలో కలిపి ఉపయోగించాలి. దోమలను తరిమి కొట్టడంలో వేప నూనె కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. మార్కెట్‌లో మనకు పలు రకాల ఎసెన్షియల్ ఆయిల్స్ లభిస్తాయి. ఇవన్నీ కూడా దోమలను తరిమికొట్టగలవు. లావెండర్ ఆయిల్, పెప్పర్ మింట్ ఆయిల్, టీ ట్రీ ఆయిల్, క్లోవ్ ఆయిల్, సినామన్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్.. ఇలా పలు రకాల ఆయిల్స్ లభిస్తాయి. వీటిలో ఏ ఆయిల్‌ను వాడినా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది.

## మొక్కలు..

దోమలను తరిమికొట్టాలంటే మీ ఇంట్లో కొన్ని రకాల ఇండోర్ మొక్కలను పెంచుకోవాలి. సిట్రొనెల్లా గ్రాస్ అని పిలవబడే ఓ రకమైన గడ్డిని ఇంట్లో పెంచాలి. ఇది మస్కిటో రీపెల్లెంట్ గుణాలను కలిగి ఉంటుంది. దీని వాసన దోమలకు నచ్చదు. దోమలను తరిమి కొడుతుంది. ఈ మొక్క నిమ్మ వాసన వస్తుంది. అందుకనే దోమలు పారిపోతాయి. లావెండర్ అనే మొక్కను ఇంట్లో పెంచుతున్నా కూడా దోమల నుంచి రక్షణ లభిస్తుంది. ఈ మొక్క నుంచి వచ్చే వాసన కూడా దోమలకు పడదు. దోమలు దూరంగా పారిపోతాయి. తులసి మొక్క ఉన్న ఇంట్లోకి దోమలు రావని చెబుతారు. కనుక తులసి మొక్కను కూడా పెంచుకోవాలి. బంతి పూల మొక్కలను ఇంట్లో లేదా ఇంటి ఆవరణలో పెంచితే దోమల బెడద నుంచి రక్షణ లభిస్తుంది. బంతిపూలు వెదజల్లే వాసన దోమలకు నచ్చదు. దోమలు దూరంగా పారిపోతాయి.

## ఈ చిట్కాలు కూడా..

పుదీనా మొక్కలను ఇంట్లో పెంచుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. పుదీనా ఆకుల నుంచి వచ్చే వాసన దోమలకు నచ్చదు. అవి దూరంగా పారిపోతాయి. లెమన్ బామ్ అనే మొక్కను పెంచుతున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. దీని నుంచి వచ్చే ఘాటైన నిమ్మ వాసన దోమలకు నచ్చదు. ఇది దోమలను పారిపోయేలా చేస్తుంది. అలాగే రోజ్‌మేరీ మొక్కలను కూడా ఇంట్లో పెంచుకోవచ్చు. ఇవి కూడా దోమల నుంచి రక్షణను అందిస్తాయి. కాట్నిప్, యూకలిప్టస్, వెల్లుల్లి మొక్కలను పెంచుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇవన్నీ దోమలు రాకుండా చేస్తాయి. అలాగే ఒక పాత్రలో కొద్దిగా నీటిని తీసుకుని అందులో కొన్ని కర్పూరం బిళ్లలను వేసి గదిలో పెట్టాలి. దాని నుంచి వచ్చే వాసనకు కూడా దోమలు పారిపోతాయి. అలాగే ఒక నిమ్మకాయను అడ్డంగా కోసి అందులో లవంగాలను గుచ్చి గదిలో కిటికీలు లేదా దోమలు ఉండే ప్రాంతంలో పెట్టాలి. ఈ వాసనకు కూడా దోమలు పారిపోతాయి. ఇలా దోమలను తరిమి కొట్టవచ్చు.